సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 17 । మార్చి । 2024



ఖగోళ ప్రయోగశాల ప్రారంభం

నంబేపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖగోళ ప్రయోగశాలను ప్రారంభించామని జిల్లా డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్వరి తెలిపారు. -8లో

రంజాన్ వేళలు

		ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
రాయచోటి	:	6.30	5.04
రాజంపేట	:	6.30	5.04
పీలేరు	:	6.32	5.00
మదనపల్లె	:	6.31	5.08

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.210
రెండోరకం	రూ.80	రూ.148

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 16 మెట్రిక్ టన్నులు



గెలుపు గుర్రాలకే పట్టం

- జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థుల ప్రకటన
- మరోమారు ఎంపీ స్థానానికి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
- టీడీపీ కంటే ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన వైఎస్సార్‌సీపీ
- మదనపల్లె, రాజంపేటకు మారిన అభ్యర్థులు
- ఇడుపులపాయలో సీఎం వైఎస్ జగన్ ప్రకటనతో కొత్త ఉత్సాహం



మహానేత వైఎస్సార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు గుర్రాలుగా భావిస్తున్న వారికి పట్టం కట్టింది. తెలుగుదేశం పార్టీ కంటే ముందుగానే ఒకేసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఇడుపులపాయలో వైఎస్సార్ ఘాట్‌కు నివాళులర్పించి ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభ్యర్థులను ప్రకటించడంతో జిల్లాలో కొత్త ఉత్సాహం నెలకొంది. పలు సర్వేలు, ఆయా నియోజకవర్గంలోని పరిస్థితులు, ప్రజల్లోకి పథకాలను తీసుకెళ్లిన తీరు, ప్రజాభిప్రాయంతోపాటు ఇతర అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఎంపిక చేసింది. ఆయా నియోజకవర్గాల్లో గెలుపునకు ఢోకా లేదన్న అభ్యర్థులకు సీట్లను కేటాయించి ఎన్నికల బరిలో నిలిచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

మూడవసారి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి అవకాశం

రాజంపేట లోక్‌సభ స్థానానికి పోటీ చేసేందుకు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి మూడవసారి అవకాశం లభించింది. రాజంపేట పార్లమెంటు పరిధిలో విశేషమైన అభివృద్ధికి కృషి చేయడంతోపాటు రాష్ట్రంలో పార్టీ పరంగా మిథున్‌రెడ్డి కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. జిల్లాలో రైల్వే సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తూ దశాబ్దాల పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మంగంపేట ప్రాజెక్టులో పునరావాస సమస్యలు మొదలుకొని అనేక పనులు పూర్తి చేయడంలో మంచి పేరు తెచ్చుకున్నారు. మరోవైపు జిల్లాలో అంతా తానై ఒకపక్క పార్టీని నడిపిస్తూనే మరోపక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగిస్తున్న బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో రాజంపేట ఎంపీగా ఘన విజయం సాధించిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రస్తుత ఎన్నికల్లో కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఇప్పటికి రాజంపేట పార్లమెంటు పరిధిలో టీడీపీ అభ్యర్థిని అధికారికంగా ప్రకటించలేదు. అయితే వైఎస్సార్ సీపీ అభ్యర్థి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో కలియ తిరుగుతూ దూసుకుపోతున్నారు.

రాజంపేట, మదనపల్లెల్లో మారిన అభ్యర్థులు

అన్నమయ్య జిల్లాకు సంబంధించి ఆరు నియోజకవర్గాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. ప్రధానంగా రాయచోటికి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, తంబళ్లపల్లె పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు చింతల రామచంద్రారెడ్డి, రైల్వేకోడూరు కొరముట్ల శ్రీనివాసులుకు సంబంధించి సిట్టింగ్ ఎమ్మెల్యేలకే పార్టీ అధిష్టానం మరోమారు అవకాశం కల్పించింది. మిగిలిన రెండు నియోజకవర్గాలలో అభ్యర్థులను మార్చింది. ప్రధానంగా రాజంపేటకు సంబంధించి సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి స్థానంలో ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డికి, మదనపల్లె సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషా స్థానంలో ఎస్.నిసార్ అహ్మద్‌ను ఎంపిక చేసింది. రెండు చోట్ల మినహా జిల్లా పార్టీ అభ్యర్థుల్లో ఎలాంటి మార్పులు, చేర్పులు చోటు చేసుకోలేదు.

పార్టీలో జోష్

2019 ఎన్నికల తరహాలోనే ఈసారి కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటించడంతో పార్టీలో జోష్ కనిపిస్తోంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలతోపాటు రాజంపేట పార్లమెంటుకు అభ్యర్థులను ఎంపిక చేయడంతో వైఎస్సార్‌సీపీలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ప్రచార పర్వాన్ని కూడా ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని వివరిస్తూ జనం ముంగిట నిలుస్తున్నారు. ప్రభుత్వంలో ఉన్న సమయంలోనూ ఏదో ఒక విధంగా ప్రతినిత్యం ప్రజాక్షేత్రంలోనే గడిపిన నేతలు ప్రస్తుతం అభ్యర్థులుగా ప్రజల ముంగిటకు వెళుతుంటే ప్రజలు ఇంటింటా హారతులు పడుతున్నారు.

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల వివరాలు

నియోజకవర్గం	వైఎస్సార్‌సీపీ అభ్యర్థి
లోక్‌సభ స్థానం	
రాజంపేట	పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి
అసెంబ్లీ స్థానాలు	
రాయచోటి	గడికోట శ్రీకాంత్‌రెడ్డి
రాజంపేట	ఆకేపాటి అమర్‌నాథరెడ్డి
రైల్వేకోడూరు	కొరముట్ల శ్రీనివాసులు
పీలేరు	చింతల రామచంద్రారెడ్డి
తంబళ్లపల్లె	పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి
మదనపల్లె	షేక్ నిసార్ అహ్మద్

రాజంపేట లోక్‌సభ స్థానం



పేరు: పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి
తండ్రి: పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
తల్లి: స్వర్ణలత
పుట్టిన తేదీ: 11 సెప్టెంబరు 1978
విద్య: చెన్నై
ఉన్నత విద్య: ఎంబీఏ (లండన్)
స్వస్థలం: ఎర్రాటివారిపల్లె, సదుం మండలం, చిత్తూరు జిల్లా
భార్య : వెంకటలక్ష్మీదివ్య
సంతానం: జస్విన్‌రెడ్డి(కుమారుడు), కుమార్తె సమన్వి
చెల్లెలు: శ్రీశక్తి
ప్రజాప్రతినిధిగా: రాజంపేట లోక్‌సభ స్థానంలో 2014లో తొలిసారిగా, 2019లో రెండవసారి విజయం సాధించారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్, లోక్‌సభ ప్యానల్‌స్పీకర్, ఏపీఎస్ఎల్‌సీసీ చైర్మన్,
రాజకీయ ప్రస్థానం: గోదావరి జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్

పీలేరు



అభ్యర్థి పేరు : చింతల రామచంద్రారెడ్డి
తండ్రి : చింతల సురేంద్రరెడ్డి (మాజీ మంత్రి)
ప్రస్తుత హోదా : ఎమ్మెల్యే
విద్యార్హత: బీ.ఏ
భార్య : చింతల నీరజ
కుమారుడు: చింతల సాయిక్రిష్ణారెడ్డి
రాజకీయ ప్రస్థానం
- 1987లో కాంగ్రెస్ తరపున నల్లారి సరోజమ్మపై టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 1989లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిపై టీడీపీ తరపున ఓటమి
- 1994లో కాంగ్రెస్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిపై టీడీపీ నుంచి గెలుపు
- 1999లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతిలో టీడీపీ తరపున ఓటమి
- 2008లో కాంగ్రెస్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతిలో ప్రజారాజ్యం తరపున ఓటమి
- 2014లో జై సమైక్యాంధ్ర నుంచి పోటీ చేసిన నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిపై వైఎస్సార్‌సీపీ తరపున గెలుపు
- 2019లో టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిపై వైఎస్సార్‌సీపీ తరపున గెలుపు
- 2024లో టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డిపై వైఎస్సార్‌సీపీ తరపున గెలుపు

రైల్వేకోడూరు



పేరు: కొరముట్ల శ్రీనివాసులు
తల్లిదండ్రులు: కొరముట్ల గంగయ్య, తులసమ్మ
జననం: 7 జూన్ 1969
విద్యాభ్యాసం: ఎంఏ, ఎంఎల్
భార్య పేరు: కొరముట్ల స్వర్ణకుమారి
సంతానం: కొరముట్ల పునీత్ రాయి, కొరముట్ల రాజశేఖర్
స్వస్థలం: రెడ్డివారిపల్లె, రైల్వేకోడూరు మండలం
రాజకీయ ప్రస్థానం:
- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తొలిసారిగా 2009 ఎన్నికల్లో జాతీయ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- వైఎస్సార్ మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీ నుంచి వైఎస్ జగన్‌తోపాటు బయటకు వచ్చి 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు.
- 2014, 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు.
- ప్రభుత్వ విప్‌గా విధుల నిర్వహణ

రాజంపేట



పేరు: ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి
పుట్టిన తేదీ: 19.04.1961
తండ్రి : ఆకేపాటి లక్ష్మీనారాయణరెడ్డి
తల్లి : ఆకేపాటి అనుసూయమ్మ
విద్యాభ్యాస్యం: ఢిల్లీకి దగ్గరలోని మీరట్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ బీఎస్సీ చేశారు.
రాజకీయ నేపథ్యం: వైఎస్ రాజశేఖర్‌రెడ్డిపై ఉన్న అభిమానంతో ఎన్ఎస్‌యూఐలో పని చేశారు.1985లో యువజన ఆర్గనైజింగ్ సెక్రటరీగా పని చేశారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షునిగా, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షునిగా, జిల్లా అధ్యక్షునిగా పని చేశారు.
- 2009లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగుపెట్టారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యేగా పని చేశారు. మహానేత మరణం తరువాత వైఎస్ జగన్ వెంట నడిచి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.
- 2012 బై ఎలక్షన్‌లో పోటీ చేసి 38 వేల పైచిలుకు మెజార్టీతో గెలిచారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

పార్టీ పదవులు: వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షునిగా, రీజినల్ కో–ఆర్డినేటరుగా పని చేశారు.

రాయచోటి



పేరు: గడికోట శ్రీకాంత్‌రెడ్డి
తల్లిదండ్రులు: గడికోట మోహన్‌రెడ్డి, కృష్ణమ్మ
జననం:15 జూన్ 1972
విద్యాభ్యాసం : బీటెక్
సతీమణి: శివలలిత
కుమార్తె : చాహ్నా
కుమారుడు: రిత్విక్‌రెడ్డి
స్వస్థలం: యర్రమరెడ్డిగారిపల్లె, సుద్దమళ్ల గ్రామం, రామాపురం మండలం
రాజకీయ ప్రస్థానం
వైఎస్ఆర్ స్ఫూర్తితో రాజకీయాలలో ప్రవేశించారు. తొలిసారిగా కడప జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికై జిల్లాలో 500 కిమీ మేర పాదయాత్ర చేశారు. 2009 ఎన్నికలలో జాతీయ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. వైఎస్ఆర్ మరణానంతరం చోటు చేసుకున్న పరిణామాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి వైఎస్ జగన్ బయటకు రావడంతో 2012లో జరిగిన ఉప ఎన్నికలలో వైఎస్ఆర్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014, 2019 ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రభుత్వ చీఫ్ విప్‌గా పని చేశారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

తంబళ్లపల్లె



పేరు: పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి
పుట్టిన తేదీ: 1-6-1967
జన్మస్థలం: సదుం (పుంగనూరు తాలుకా, చిత్తూరు జిల్లా)
భార్య : పెద్దిరెడ్డి కవిత
కుమారుడు: పెద్దిరెడ్డి వెంకట అభినయ్‌రెడ్డి
ప్రస్తుత హోదా: ఎమ్మెల్యే
కుటుంబం : ఉమ్మడి కుటుంబం, నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యలు పరిష్కరించడం
రాజకీయ ప్రవేశం: 1994లో కాంగ్రెస్ పార్టీ నుంచి..
రాజకీయ అనుభవం: ఉమ్మడి చిత్తూరు జిల్లా సదుం సింగిల్‌విండో చైర్మన్, సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా పని చేశారు.
- 2019లో తొలిసారి తంబళ్లపల్లె వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటి చేసి 46,938 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2024 ఎన్నికల్లో రెండోసారి పోటీ చేస్తున్నారు.

మదనపల్లె



పేరు: షేక్ నిసార్ అహ్మద్
తండ్రి పేరు: ఎస్. హాజీ ప్యారేజాన్ సాహెబ్
పుట్టిన తేదీ: 01.05.1964
విద్యార్హతలు: బీఈ(సివిల్ ఇంజినీరింగ్)
ఉద్యోగం: పంచాయతీరాజ్‌శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతల నిర్వహణ
రాజకీయ నేపథ్యం: ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూ, స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నారు. ప్రజాసేవ చేయాలని భావించి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరి తండ్రి హాజీ ప్యారేజాన్ సాహెబ్ మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి పరిచయస్తులు. హాజీ ప్యారేజాన్‌సాహెబ్ పట్టణంలోని జామియామసీదు పెద్దగా చాలా కాలంపాటు సేవలందించారు. ముస్లిం కమ్యూనిటీలో వీరి కుటుంబానికి, విద్యావంతులు, వివాదరహిత కుటుంబంగా మంచిపేరు ఉంది. నిసార్‌అహ్మద్ ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే మొదటిసారి.

మాట మీద నిలిచే నేత జగన్

- మరో అవకాశం ఇవ్వండి
- చేయూతతో మొత్తం లబ్ధి: రూ.102.96 కోట్లు
- ఈబీసీ నేస్తం ద్వారా రూ.15.54 కోట్లు
- సదస్సులో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చి మాట మీద నిలిచే నాయకుడిగా పేరొందారని ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటిలో నియోజకవర్గ స్థాయి వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత, మూడవ విడత ఈబీసీ నేస్తం సదస్సులను సంయుక్తంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు 2014 ఎన్నికలలో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చక మాట తప్పిన నాయకుడిగా పేరొందారన్నారు. తిరిగి ఎన్నికల వేళ హామీలను ఇస్తూ ప్రజలను మోసగించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. జగన్‌కు మరో అవకాశం ఇస్తే మరింత మెరుగైన పాలన, మేలు అందుతుందన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని చెప్పి నేటికి సంపూర్ణంగా ఆ హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. రాయచోటి నియోజకవర్గంలో వైఎస్ఆర్ చేయూత ద్వారా నాలుగు విడతల్లో రూ.102.96 కోట్లు, వైఎస్ఆర్ ఆసరా ద్వారా నాలుగు విడతల్లో రూ.108.97 కోట్లు, వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం ద్వారా మూడు విడతల్లో రూ.15.54 కోట్లు, అమ్మ ఒడి ద్వారా రూ.20 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఈ ఎన్నికలలో తనకు, ఎంపీ మిథున్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మెగా చెక్‌ల అందజేత

రాయచోటి నియోజకవర్గానికి సంబంధించి వైఎస్ఆర్ చేయూత నాల్గవ విడతలో రూ.27.99 కోట్లు, ఈబీసీ నేస్తం లబ్ధి రూ.5.25 కోట్ల మెగా చెక్కులను ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సదస్సులకు నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మదనపల్లె పార్టీ పరిశీలకులు హబీబుల్లాఖాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తబ్రేజ్‌ఖాన్, కొలిమి హరూన్, సాదిక్‌అలీ, షబ్బీర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్‌రెహమాన్, ఆసీఫ్‌అలీఖాన్, ఎస్‌పీఎస్ రిజ్వాన్, గౌస్‌ఖాన్, కొలిమి చాన్‌బాషా, రియాజ్, జానం రవీంద్రయాదవ్, సుగవాసి ఈశ్వర్‌ప్రసాద్, సుగవాసి శ్యామ్, అల్తాఫ్, రౌనక్, ఫయాజ్‌అహ్మద్, ఇర్ఫాన్, అబుజర్, నవాజ్, సున్నా, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ నవరంగ్‌నిస్సార్, మాజీ జెడ్పీటీసీ హసన్‌బాషా, మురికినాటి వెంకట్రామిరెడ్డి, జీఎండీ ఇమ్రాన్, జీఎండీ ఇర్షాద్, నేలపాటి వెంకటేష్, ఫైరోజ్‌ఖాన్, కౌన్సిలర్ చంద్రశేఖర్, బీసీ సెల్ విజయభాస్కర్, గువ్వల బుజ్జిబాబు, ముదిరాజ్ యువసేన జిల్లా అధ్యక్షుడు విక్కీ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఏర్పాటు



ఇ.అనిల్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె: వైఎస్ఆర్‌సీపీలో వివిధ విభాగాలకు జిల్లా నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ప్రకటన వెలువడింది. జిల్లా డాక్టర్ల విభాగ కమిటీ అధ్యక్షునిగా డాక్టర్ ఇందుకూరి అనిల్‌కుమార్‌రెడ్డి(మదనపల్లె), వైస్ ప్రెసిడెంట్‌గా రామచంద్రారెడ్డి(రాజంపేట), జనరల్ సెక్రటరీలుగా వీరప్రకాష్ (రాజంపేట), కె.వెంకట్రామయ్య(పీలేరు), ఓ.వేణుగోపాల్‌రెడ్డి(రైల్వేకోడూరు), సెక్రటరీలుగా వై.సి.రాజు, గుర్రంపాటి సుబ్బారెడ్డి(రాజంపేట), ఎస్.మల్లిరెడ్డి, బి.బావాజాన్(తంబళ్లపల్లె), ఆర్.రవిశంకర్‌రెడ్డి, మేకల దినేష్‌కుమార్‌రెడ్డి (పీలేరు), పి.అయూబ్‌ఖాన్, టి.మణిదీప్(రైల్వేకోడూరు), జాయింట్ సెక్రటరీలుగా తుమ్మలూరు వెంకటరమణ(రాజంపేట), నిమ్మనపల్లి చంద్రారెడ్డి, జి.ప్రవీణ్ (తంబళ్లపల్లె), టి.భానుప్రకాష్‌రెడ్డి, డి.మౌర్య(పీలేరు), ఎం.బాబు, వై.దామోదర్‌రెడ్డి(రైల్వేకోడూరు)లను నియమించారు.

మైనార్టీ విభాగం

రాయచోటి అర్బన్: వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా బేపారి మహమ్మద్‌ఖాన్, ఉపాధ్యక్షుడిగా ఎస్.కె.మహమ్మద్ జహీర్ అలీ, జనరల్ సెక్రటరీలుగా ఎస్ఎండీ సలీం, సయ్యద్ అబ్దుల్ హుస్సేన్, కార్యదర్శులుగా వలీచాన్, జాకీర్ హుస్సేన్, మూసా కరీముల్లా, నిజామ్, జాయింట్ సెక్రటరీలుగా సయ్యద్ గౌస్‌బాషా, దర్బార్, రాయచోటి జాకీర్‌హుస్సేన్‌లను నియమించారు. ఈ సందర్భంగా మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో వైఎస్ఆర్‌సీపీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

యువజన విభాగం

రాయచోటి టౌన్: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా సమరసింహారెడ్డి (రాయచోటి), ఉపాధ్యక్షులుగా కె.ప్రణయ్‌రెడ్డి (తంబళ్లపల్లె), ప్రధాన కార్యదర్శులుగా పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి (పీలేరు), పీఎంబీ జబీవుల్లాఖాన్ (రాయచోటి), పల్లె గ్రీష్మంత్ రెడ్డి, కార్యదర్శులుగా మెకానిక్ రవి (రాజంపేట), పోలి పెంచల్‌రెడ్డి, చింతంరెడ్డి రామాంజుల రెడ్డి (రాయచోటి), గోండిపల్లె హరీష్‌కుమార్‌రెడ్డి (రాయచోటి), వి.అజయ్‌కుమార్ (పీలేరు), జాయింట్ సెక్రటరీలుగా మడితం రెడ్డికుమార్ (రాయచోటి), ఇద్రాకర్ కార్తీక్ (రాయచోటి)లను నియమించారు.

సేవాదళ్

రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సేవాదళ్ విభాగం కార్యదర్శిగా అన్నమయ్య జిల్లాకు చెందిన కనపర్తి చెన్నారెడ్డిని నియమిస్తూ పార్టీ కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

న్యూస్‌రీల్

ఆరోగ్య కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి అర్బన్: పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్‌సెంటర్‌ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణాధికారి(డీపీఎంఓ) డాక్టర్ రియాజ్ బేగ్ అన్నారు. శనివారం ఆయన డిస్ట్రిక్ట్ న్యూక్లిస్ మెడికల్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి రాయచోటి మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లె అర్బన్‌హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఓపీల సంఖ్యను మరింతగా పెంచాలన్నారు. అనంతరం ఆయన రికార్డుల గది, ల్యాబ్, స్టోర్స్, మైనర్ ఓపి గదులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రానికి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యుడు అల్తాఫ్‌తో పాటు ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

24లోపు పీసీపీయన్‌డీటీ సమావేశాలు

రాయచోటి అర్బన్: ఈ నెల 24వ తేదీలోపు పీసీపీయన్‌డీటీ(గర్భస్థ పిండ లింగనిర్ధారణ) ఏఆర్‌టీ చట్టాల అమలుకు సంబంధించిన సమావేశాలను ఈ నెల 24వ తేదీలోపు నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య తెలిపారు. శనివారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ జిల్లాలోని పీసీపీయన్‌డీటీ టీం సభ్యులతో విజయవాడ నుంచి జూమ్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు కాకుండా గూగుల్ ప్రకటనలు, ప్రచురణల ద్వారా చేస్తున్న స్కాన్ సెంటర్‌లు, ఆసుపత్రులు, డయోగ్నోస్టిక్ సెంటర్‌లను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా చట్ట ఉల్లంఘనకు పాల్పడినట్లయితే వారికి మొదటి తప్పుగా షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. రెండవ తప్పుగా రూ. 25 వేల జరిమానా, 3వ తప్పునకు చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె డివిజనల్ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, చిత్రంలో ఎస్పీ కృష్ణారావు

రాయచోటి: సాధారణ ఎన్నికలను జిల్లాలో పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో 2024 సాధారణ ఎన్నికల నిర్వహణపై ఎస్పీ కృష్ణారావుతో కలిసి ఆయన పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. కుల, మత, ప్రాంతీయ పరమైన విద్వేషాలు చేయడం, రెచ్చగొట్టేలా రాజకీయ నేతలు ప్రవర్తించకూడదన్నారు. అనుమతి లేకుండా బ్యానర్లు కట్టడం, లౌడ్ స్పీకర్ల ఏర్పాటు, గోడలపై నినాదాలు రాయడం, పోస్టర్లు అతికించకూడదన్నారు. కలెక్టరేట్‌లో ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రతి నియోజకవర్గంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక

వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. శనివారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి గ్రూప్–1 పరీక్షలకు సంబంధించిన సూచనలు, ఎన్నికల మోడల్ కోడ్ ప్రవర్తన, ఎంఎస్ఎంఈ, పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, తాగునీటి ఎద్దడి నివారణ, వైద్య ఆరోగ్యం, జనన మరణాల నమోదు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సుకు రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, డీఆర్‌ఓ సత్యనారాయణరావు హాజరయ్యారు. కాన్ఫరెన్సు అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలలో ఇప్పటికే ఆమోదం పొంది ప్రారంభించిన పనులను పూర్తి చేయాలన్నారు.

అమరజీవి త్యాగం మరువలేనిది

ఆంధ్రరాష్ట్ర సాధన కోసం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరువలేనిదని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. రాయచోటి కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమరజీవి జయంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప, డీఆర్‌ఓ పురుషోత్తం, ఆర్డీసీ ఆర్ఎం రాము, కలెక్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులే కీలకం!

రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో కీలకపాత్ర పోషించేది జిల్లా అధికారులే. అందులో ఒకరు కలెక్టర్.. మరొకరు జిల్లా ఎస్పీ. వీరికి తోడు ఆర్‌ఓ, పోలింగ్ ఆఫీసర్ల పాత్రలు కూడా ప్రధానమైనవే. రానున్న ఎన్నికల రథసారథుల గురించి తెలుసుకుందాం..

- జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్
- ప్రతి నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి
- నామినేషన్ల పర్వం వీరి కనుసన్నల్లోనే


జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం ..జిల్లా కలెక్టరేట్

రాజంపేట : ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రజల తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు కౌంట్ డౌన్ మొదలైంది. భారత ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉంటుంది. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడంలో బూత్‌స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎందరో అధికారుల శ్రమ ఉంటుంది. అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తవుతుందనడంలో సందేహం లేదు.

అధికారుల విధులు తెలుసుకుందాం..

ఎన్నికల్లో నామినేషన్ల స్వీకరణ నుంచి ఫలితాలు వెల్లడించే వరకు ప్రతి సందర్భంలో అధికారుల విధుల గురించి ప్రతి ఓటరు తెలుసుకోవాల్సి ఉంది.

ప్రధాన ఎన్నికల అధికారి

రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం సంబంధిత రాష్ట్రాన్ని సంప్రదించి ప్రధాన ఎన్నికల అధికారిని నియమిస్తుంది. రాష్ట్రంలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం ప్రధాన ఎన్నికల అధికారికి ఉంటుంది.

జిల్లా ఎన్నికల అధికారి

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణ, నియంత్రణకు లోబడి ప్రతి జిల్లాకు ఒక జిల్లా అధికారి ఉంటారు. సంబంధిత కలెక్టర్ ఈ బాధ్యతలను నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అమలుచేస్తూ ఎన్నికల నిర్వహణలో కీలకభూమిక పోషిస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ)

శాసనసభ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి నియోజకవర్గానికి ఒక రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఆయా నియోజకర్గాలలో రెవెన్యూ డివిజనల్ అధికారి లేదా జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. నియోజకవర్గంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులు, అభ్యర్థుల తుదిజాబితా వీరే తయారు చేస్తారు. పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వహించే సిబ్బంది నియామకం , వారికి శిక్షణ, ఓట్ల లెక్కింపు , ఫలితాలు ప్రకటన తదితర పనులు ఆర్‌ఓ పర్యవేక్షణలో జరుగుతాయి.

సెక్టోరల్ అధికారి

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఒక సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చోట 144 సెక్షన్ విధించే అవకాశం సెక్టోరల్ అధికారికి ఉంటుంది. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ బూత్‌లు గుర్తించి అక్కడ బందోబస్తుకు సిఫార్సు చేయడం వంటి విధులు నిర్వహిస్తారు.

ప్రిసైడింగ్ అధికారి..

ప్రతి పోలింగ్ బూత్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఆయన పోలింగ్‌కు అవసరమైన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను బూత్‌కు తీసుకువస్తారు. పోలింగ్ అనంతరం సీల్ వేసి స్ట్రాంగ్‌రూంకు తరలిస్తారు. ఇతనికి మరో అధికారి ఏపీఓ ఉంటారు. పోలింగ్ కేంద్రాల్లో జరిగే అన్ని కార్యకలాపాలు ఈయన పర్యవేక్షణలోనే జరుగుతాయి.

ఫ్లైయింగ్‌స్క్వాడ్ అధికారులు

నియోజకవర్గంలో మూడు నుంచి నాలుగు మండలాలకు ఒక ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం ఉంటుంది. వీరు ఆ పరిధిలో మద్యం, డబ్బు, ప్రలోభపరిచేందుకు తరలించే సామగ్రి అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు నిర్వహిస్తారు.

మైక్రో అబ్జర్వర్లు

ఎన్నికలు జరిగే తీరుపై నివేదిక రూపొందించి జిల్లా రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపడంలో మైక్రో అబ్జర్వర్లు కీలకంగా వ్యవహరిస్తారు.

బీఎల్‌ఓలు..

కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి దరఖాస్తులను అందచేయడం, ఓటర్లను తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడడం బీఎల్‌ఓల బాధ్యత. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు గురించి ఉన్నతాధికారులకు తెలియచేయడం, ఓటరు జాబితా ప్రదర్శన, పోలింగ్ కేంద్రాల మార్పు తదితర సేవలను అందిస్తారు.

ఓటర్ల నమోదు అధికారి

ఓటర్ల జాబితాను తయారు చేయడం ఈయన బాధ్యత. ఓటు నమోదు చేసుకునే వారు జాబితాలో పేర్లు తప్పుగా ఉన్న వారు ఈయనను సంప్రదిస్తే తగిన చర్యలు తీసుకుంటారు. ఈయన పర్యవేక్షణలో కొందరు సిబ్బంది పనిచేస్తారు.

ఎన్నికల నిబంధనలివే...

- ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించడం నేరం. ఉల్లంఘనలపై ఈ కింది సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తారు.
- ప్రజాప్రాతినిధ్యచట్టం 1951 సెక్షన్ 123(1) ప్రకారం ఓటర్లను ప్రలోభ పెట్టడం, భయాందోళనకు గురిచేయడం, కుల, మత విద్వేషాలను పెంచడం, ఎదుటి వారి వ్యక్తిగత విషయాలను విమర్శించడం నేరం.
- సెక్షన్ 125 ప్రకారం శత్రుత్వం కలిగించడం నేరం. సెక్షన్126 ప్రకారం నిషేధిత ప్రాంతాల్లో ప్రచారం చేయడం చట్టవిరుద్ధం.
- సెక్షన్ 127 ప్రకారం ఇతరుల సమావేశాలను భంగపరచటం, 127(ఎ) ప్రకారం పోస్టర్లను, కరపత్రాలపై నియంత్రణ లేకపోవడం నేరం.
- సెక్షన్ 128 ప్రకారం రహస్య ఓటింగ్‌కు భంగం కలిగించడం నేరం.సెక్షన్ 130, 131, 132 ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద ప్రచారం చేయడం, క్రమశిక్షణ లేకుండా బూత్‌ల వద్ద ప్రవర్తించడం, హద్దుమీరి వ్యవహరించడం నేరం
- సెక్షన్ 133 ప్రకారం ఓటర్లను చేరవేసేందుకు వాహనాలు ఉపయోగించడం నేరం, 134 ప్రకారం ఓటర్లకు తాయిలాలు పంపిణీ చేయడం నిషేధం.
- సెక్షన్ 135, 135ఎ,136ల ప్రకారం పోలింగ్ స్టేషన్లను ఆక్రమించడం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, రికార్డులను తొలగించడం, నాశనం చేయడం, ధ్వంసం చేయడం నేరం.
- సెక్షన్ 171జీ ప్రకారం ఎన్నికలకు సంబంధించి అసత్య ప్రచారాలు చేయడం, 172 హెచ్, 172 ఐ ప్రకారం ఖర్చుచేసిన నిధులకు లెక్కలు చెప్పకపోవడం వంటి తదితర నేరాలన్ని ఎన్నికల ప్రవర్తన నియమావళిలోకి వస్తాయి.

క్లుప్తంగా

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లి మండలం బసినికొండకు చెందిన రమేష్ బాబు కుమారుడు ఎస్. రెడ్డి శివ కుమార్ (35), ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో వస్తూ పుంగనూరు రోడ్డు రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు బాధితుడిని 108 వాహనంలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదేవిధంగా శుక్రవారం రాత్రి నీరుగట్టువారిపల్లెకు చెందిన కృష్ణమ్మ(65), తన కొడుకు సురేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో పట్టణంలోకి వస్తుండగా మార్గమధ్యంలోని, సంగం ఫంక్షన్ హాల్ స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆమె కింద పడింది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె : డిగ్రీ చదువుతున్న యువతి అదృశ్యం కావడంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ ఎస్. శేఖర్ తెలిపారు. మదనపల్లె మండలం కోటవారిపల్లెకు చెందిన ఓ యువతి (20) మదనపల్లి పట్టణంలోని ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతోంది. 15వ తేదీ శుక్రవారం కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో, యువతి తండ్రి శనివారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


సుధాకర్ (ఫైల్)

వీరబల్లె (రాయచోటి టౌన్) : వీరబల్లె మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె గ్రామంలోని బెజవాడ దళితవాడలో శుక్రవారం రాత్రి గండుపల్లె సుధాకర్ (40) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని గంగమ్మ గుడి వద్ద శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ నేపథ్యంలో రాత్రి గుడిలో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. దీంతో సుధాకర్ ద్యుత్‌ను పునరుద్ధరించేందుకు గుడిపైకి ఎక్కి మరమ్మతులు నిర్వహిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడ నుంచి కింద పడ్డాడు. వెంటనే స్థానికులు, బంధువులు సుధాకర్‌ను రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న వీరబల్లె ఎస్ఐ చంద్రమోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, 8 సంవత్సరాల వయస్సు ఉన్న పాప ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కమాల్‌బాషా దర్గాలో హుండీ చోరీ


దర్గాలో హుండీని పరిశీలిస్తున్న పోలీసులు

గుర్రంకొండ : చరిత్రాత్మకమైన గుర్రంకొండ కమాల్‌బాషా దర్గాలోని హుండీని దుండగులు ఎత్తుకెళ్లారు. టిప్పుసుల్తాన్ ఆస్థాన గురువులు షాకమాల్ దువ్వమ్. ఆయన పేరుమీదనే ఇక్కడ కమాల్‌బాషా దర్గా ఉంది. ప్రతి నిత్యం పర్యాటకులు, భక్తులు దర్గాకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో దర్గాలో ఏర్పాటు చేసిన హుండీని దుండుగులు శుక్రవారం రాత్రి పగులగొట్టి అందులో నగదు చోరీ చేసుకెళ్లారు. శనివారం జరిగిన సంఘటనపై దర్గా పీఠాధిపతి షఫివుల్లా హుస్సేనీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్గావద్దకు చేరుకుని హుండీని పగులగొట్టిన దృశ్యాలను పరిశీలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకొని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలోని చీకలబైలు రాష్ట్ర సరిహద్దు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక రాష్ట్రం బెంగళూరు వైట్ ఫీల్డ్ థర్డ్ క్రాస్‌కు చెందిన బాలరాజు కుమారుడు బండి విజయ్ బాబు (42), కలికిరిలో బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు వస్తూ, కర్ణాటక మద్యం తీసుకొస్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి కర్ణాటకకు చెందిన రూ.3150 విలువగల 18 బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కడప వాసికి ఏపీఎన్‌ఆర్‌టీఎస్ తోడ్పాటు

– కేసుల్లేకుండా ఇండియాకు వచ్చేందుకు సహకారం

కడప కార్పొరేషన్ : కడప నగరం కుమ్మరికుంటకు చెందిన షేక్ మహమ్మద్ రఫీకి ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్‌ఆర్‌టీఎస్) తోడ్పాటునందించింది. వివరాలిలా ఉన్నాయి. రఫీ 6 మాసాల క్రితం డ్రైవర్ పని కోసం కువైట్ వెళ్లాడు. కువైటీ (స్పాన్సర్) ప్రతి రోజు కొట్టడం తిట్టడం చేసే వాడు. రెండు నెలలు ఓపిక పట్టిన ఆయన కువైటీ ఇంటి నుంచి పారిపోయి తెలిసిన వారి దగ్గర ఆశ్రయం పొందాడు. వీసా తీసిన ఏజెంట్‌ను అడిగితే నీవు చెప్పకుండా పారిపోయావు నేను ఏమీ చేయలేనని చేతులెత్తేశాడు. కడపలో ఉంటున్న రఫీ తల్లి జరిగిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ 34వ డివిజన్ ఇన్‌చార్జి ఏ.అలీ ద్వారా ఏపీఎన్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ బీహెచ్ ఇలియాస్‌కు తెలిపింది. ఆయన వెంటనే స్పందించి వైఎస్సార్‌సీపీ కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ నాయని మహేష్ రెడ్డిల ద్వారా భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడి షేక్ మహమ్మద్ రఫీ పై ఎలాంటి కేసులు లేకుండా, జైలుకు వెళ్లకుండా అవసరం అయితే మళ్లీ కువైట్ వచ్చేటట్లు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు రఫీ మాట్లాడుతూ తాను కువైటీ ఇంటినుంచి పారిపోయి వచ్చాక ఏజెంట్ మొదలుకొని అందరకూ నీవు ఇండియాకు పోవాలంటే జైలుకు పోవాలి, మళ్లీ కువైట్‌కు రాలేవని చెప్పారని, దాంతో చాలా భయమేసిందన్నారు. దేవుడి దయ వల్ల ఏపీఎన్‌ఆర్‌టీఎస్ సభ్యులు సొంత అన్నల్లాగా తనకు సాయం చేశారని, వారి ద్వారా ప్రవాసాంధ్రులను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కువైట్ కమిటీ సభ్యులు గోవిందు నాగరాజు, ఎం. చంద్రశేఖర్ రెడ్డి, పి. సురేష్ రెడ్డి, పి. గంగిరెడ్డి, సయ్యద్ నజర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 63 కేసులు పరిష్కారం


లోక్ అదాలత్‌లో ఫిర్యాదుదారులను విచారిస్తున్న జడ్జి శ్రీనివాస కల్యాణ్

సిద్దవటం: జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 63 కేసులు పరిష్కరించామని సిద్దవటం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కల్యాణ్ అన్నారు. సిద్దవటం కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం పోలీసు స్టేషన్, అట్లూరు, ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌ల పరిధిలోని క్రిమినల్ కేసులు 14, సివిల్ కేసులు 4, భార్యా భర్తల కేసులు 3, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన కేసులు 18, ప్రీ లిటిగేషన్ రెగ్యులర్ కేసులు 14, బ్యాంకు రుణాల కేసు 1, అడ్మిషన్ కేసులు 9, మొత్తం 63 కేసులను పరిష్కరించామని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన కేసుల సెటిల్ మెంట్ అమౌంట్ రూ. 6,160 , బ్యాంకు రుణాల కేసులో సెటిల్ మెంట్ అమౌంట్ రూ. 32,157 అడ్మిషన్ కేసుల్లో సెటిల్ మెంట్ అమౌంట్ రూ.19,200 కలిపి మొత్తం రూ. 57,517 వచ్చిందన్నారు. క్షణికావేశంలో జరిగే ఘర్షణలను గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలే తప్ప, పోలీసు స్టేషన్‌ల వరకు వెళ్ల కూడదన్నారు. కోర్టులకు వెళితే అక్కడ విచారణలు పూర్తి అయిన తరువాతనే తీర్పు చెబుతారన్నారు. దీంతో మీకు అధిక ఖర్చులతో పాటు విలువైన సమయం వృథా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అయితే అది రాజమార్గమే అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బి. వెంకటరత్నం, రామదాసు, శివరామ్, మండల లీగల్ సర్వీసెస్ సభ్యులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, ఫిర్యాదుదారులు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 3000 కేసులకు పరిష్కారం

జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉమ్మడి వైఎస్‌ఆర్ జిల్లా వ్యాప్తంగా 13 కోర్టులలో ఏర్పాటు చేసిన 24 బెంచీలలో 3000 కేసులను పరిష్కరించారు. ఈ కేసుల ద్వారా కక్షిదారులకు రూ. 10,05,21,071 లు నష్టపరిహారం ద్వారా అందజేయాలని ఉత్తర్వులను ఇచ్చారు. ఇంకా కేసుల పరిష్కారం కొనసాగుతోంది.

బక్కన్నగారిపల్లెలో అరటితోట దగ్ధం

– రూ.7లక్షల మేర ఆస్తినష్టం

వేంపల్లె : మండలంలోని బక్కన్నగారిపల్లె గ్రామంలో బుక్కే శీనునాయక్ అనే రైతు 3 ఎకరాల అరటితోట మంటలు చెలరేగి దగ్ధమైంది. శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు .. బుక్కే శీనునాయక్ 3 ఎకరాలు అరటి తోటను సాగుచేశాడు. అయితే తన పొలం పక్కన గుర్తు తెలియని వ్యక్తులు చెట్ల పొదలకు నిప్పు పెట్టారు. దీంతో నిప్పురాసుకుంటూ అరటితోటకు వ్యాపించింది. స్థానికులు గమనించి రైతుకు సమాచారం ఇవ్వగా, వెంటనే ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశాడు. ఫైర్ ఇంజన్ వచ్చేలోపు తనకున్న మూడు ఎకరాల అరటితోట, డ్రిప్పుపైపులు, ప్లాస్టిక్ పైపులు అన్ని కాలి బూడిదయ్యాయి. దీంతో రూ.7లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అరటితోట గెలలు వేసి 20 రోజుల్లో కోతకు వచ్చే సమయంలో ఇలా జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకొని తనకు నష్టపరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

బెటాలియన్‌లో ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి


పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న కమాండెంట్

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శనివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి కమాండెంట్ పి.రవిశంకర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవి అయిన మహాపురుషుడు పొట్టి శ్రీ రాములు అన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హ రిజనోద్ధరణ, ఆశయాల కోసం జీ వితాంతం కృషి చేశారని కొనియాడారు. అడిషనల్ క మాండెంటు నాగేశ్వరప్ప పాల్గొన్నారు.

యువత ఓటు హక్కును వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మాక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న విద్యార్థులు

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

కలికిరి : యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శనివారం ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నైబర్ హుడ్ పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన జేసీ మాట్లాడుతూ యువత ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా ఓటు హక్కును వినియోగించుకుని, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రధానంగా యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి నైబర్‌హుడ్ పార్లమెంట్ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల పోలింగ్, నమూనా పోలింగ్‌లను జేసీ పరిశీలించి నమూనా పోలింగ్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాక్ పార్లమెంట్‌లో భాగంగా విద్యార్థులు దేశ ప్రగతి, సంక్షేమంపై చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో స్వీప్ ప్రత్యేకాధికారి రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ అపర్ణ, తహసీల్దారు విజయకుమారి, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెకాలపు హామీలను అమలుచేయాలి


మాట్లాడుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీల సమ్మెకాలపు హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెకాలపు హామీల అమలుకు ఉద్దేశించి ప్రభుత్వం జీఓలను విడుదల చేయడమే కాకుండా వాటిని వెంటనే అమలుపరిచే బాధ్యతను తీసుకోవాలన్నారు. సమ్మెకాలపు జీతాలు, ఫిబ్రవరి జీతం, మార్చివరకు సంపూర్ణ పోషణ బిల్లులు, సెంటర్ల అద్దెలు, ఈవెంట్ బిల్లులు, కరెంటు బిల్లులు తదితరాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరి, గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి విశ్వనాథనాయక్, రాయచోటి పట్టణ కార్యదర్శి పుల్లయ్య, నాయకులు అమరనాథ, సుజాత, విజయలక్ష్మి అనురాధ, తులసి, దుర్గ, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లె హైస్కూల్‌లో ఖగోళ ప్రయోగశాల ప్రారంభం


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్వరి

సంబేపల్లె : ఖగోళ విషయాల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంపొందించేందుకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో ఖగోళ ప్రయోగశాలను ప్రారంభించామని అన్నమయ్య జిల్లా డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజేశ్వరి తెలిపారు. సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం ఖగోళ ప్రయోగశాల నిర్వహణ విధానంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖగోళ వింతలను తెలుసుకోవడానికి, ఖగోళంపై అధ్యయనం చేసేందుకు ఈ ప్రయోగశాల ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం ఆరు పాఠశాలల్లో ఖగోళ ప్రయోగశాలలను ఏర్పాటు చేశామన్నారు. వాటిలో రామాపురం మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్ మాసాపేట, జిల్లా పరిషత్ హైస్కూల్ సంబేపల్లె, ప్రభుత్వ జూనియర్ కళాశాల కలకడ, కేవీపల్లి మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్ కేవీ పల్లె ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడితాటి నరసింహారెడ్డి, సైన్స్ ఆఫీసర్ ఓబుల్ రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బుజ్జిరెడ్డి, ఖగోళ ప్రయోగశాలలున్న ఆరు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు

రామాపురం : ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఒకే దఫా రెండు డీఏలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పీఎస్‌టీయూ రాష్ట్ర నాయకుడు జమాల్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ మజహరూల్ హక్, రవాణా శాఖ ఉద్యోగి చాంద్‌బాషా కృతజ్ఞతలు తెలిపారు. గత ఏడాది జనవరి నుండి ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన డీఏ 3.64 శాతం అలాగే గత ఏడాది జులై 1 నుండి ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వాల్సిన మరో డీఏ 3.64 శాతం మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు.